ప్రజాశక్తి
గురువారం 9 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

కబ్జా కోరల్లో కార్పొరేషన్ స్థలాలు!

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ ఆదాయానికి గండిగొట్టే చర్యలు పెరుగుతున్నాయి. రాజకీయ వత్తిడితో అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. రెండేళ్ల క్రితం గుంటూరు - విజయవాడ మార్గంలో ఇండస్ట్రియల్ జోన్‌లోని 10 ఎకరాల స్థలాన్ని ప్లాట్లుగా వేసి విక్రయించారు. భూ మార్పిడి చేసి కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన 3 శాతం పన్ను చెల్బించకపోవడం వల్ల కార్పొరేషన్ దాదాపు రూ.10 కోట్ల ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. అంతేగాక కార్పొరేషన్‌కు ఇవ్వాల్సిన 10 శాతం భూమిని కూడా ఇవ్వకుండానే మొత్తం భూమిని ప్లాట్లుగా వేసి విక్రయించారు. ఈ వ్యవహారంలో అప్పటి కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు విక్రయదారులతో లాలూచి పడి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారనే ఆరోపణలు వచ్చాయి. ఎస్‌విఎన్ కాలనీ, ఉద్యోగ నగర్‌తో పాటు పలు విలీన గ్రామాల్లోనూ రిజర్వ్ స్థలాలు కబ్జా అయినట్టు తెలిసింది. మరోవైపు ఇటీవల అంకిరెడ్డిపాలెం వద్ద అనుమతి లేకుండా వెంచర్లు వేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. వీటిని తొలగించడానికి వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులకు వైసిపి నాయకుల నుంచి వత్తిడి రావడంతో వెనుదిరిగారు.

చక్రం తిప్పుతున్న ప్రజాప్రతినిధులు

నిబంధనల ప్రకారం గుంటూరు నగర పాలక సంస్థ అనుమతి లేకుండా లే అవుట్ వేశారు. అయితే అప్రూడ్ లేవుట్‌లలో కార్పొరేషన్ పరిధిలో ఉన్న రిజర్వు స్థలాలను రక్షించాలని కమిషనర్ ఆదేశాలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. తాజాగా అధికార పార్టీ నేతల అండదండలతో శారదా కాలనీలో కార్పొరేషన్‌కు ఉన్న రిజర్వు స్థలాన్ని మాజీ కార్పొరేటరు ఒకరు విక్రయించారు. ఈ వ్యవహారంలో కార్పొరేషన్‌లో కీలక ప్రజా ప్రతినిధి హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. శారదా కాలనీ 10వ లైనులో మున్సిపల్ రిజర్వు స్థలంలో అక్రమ నిర్మాణాలపై ఇటీవల కొంతమంది స్పందనలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని రూ.40 లక్షలకు విక్రయించారని తెలిసింది. ఈ వ్యవహారంలో పలువురు ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు తెలిసింది.

1977లో తుపాను నిర్వాసితులకు లే అవుట్‌లకు ఆమోదించి కార్పొరేషన్‌కు కొన్ని స్థలాలను రిజర్వు చేశారు. వీటిని కబ్జా చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఈ అంశం ఇటీవల స్పందనలో కొంత మంది శారదాకాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది.



శారదాకాలనీలో రిజర్వు స్థలంలో చేపట్టిన నిర్మాణం

నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారుల విస్తరణలోనూ మాస్టర్ ప్లాన్‌కు భిన్నంగా జరుగుతున్నట్టు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. రహదారుల విస్తరణలో ఇళ్లకు రెడ్ మార్కు వేసి మీ గోడలు పోతాయి.. మీ స్థలాలు పోతాయి.. అని బెదిరించి కొంత మంది కార్పొరేటర్లు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. గతేడాది గడ్డిపాడు వద్ద పందుల కాలనీలో టిడిఆర్ బాండ్ల కుంభకోణం వెలుగుచూసింది. ఈ ఘటనలో ఇంత వరకు ఎవరిపైనా చర్యలు లేవు. దీంతో ప్రజలను వివిధ రూపాల్లో మభ్యపెట్టి రోడ్డు విస్తరణను ఒక సాకుగా చూపి వారి వద్ద నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి.

బంగారం మాయం కేసులో

అసిస్టెంట్ మేనేజర్ అరెస్టు

రూ.26 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బంగారం మాయం కేసులో మండలంలోని రెంటపాళ్ల యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మోటుమర్రి రవికుమార్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుండి సుమారు రూ.16 లక్షలు విలువైన 350 గ్రాములు బంగారం ఆభరణాలు, రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రవికుమార్‌ను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు రూరల్ సిఐ ఆర్.ఉమేష్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే బ్యాంకు మేనేజర్ రాంబాబు నాయక్, అప్రైజర్ ఇమిడిసెట్టి సంపత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయగా అప్రైజర్ వద్ద 650 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఆర్‌జెడి

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఇంటర్ విద్య ఆర్‌జెడి వి.వి.సుబ్బారావు కోరారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 15న ఎథిక్స్, 17న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలు జరుగుతున్నందున పరీక్షల ఏర్పాట్లపై స్థానిక ఏసీ కాలేజిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వి.వి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి కళాశాలలో యూడైస్ ప్రకారం బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రయోగ పరీక్షలకు అధ్యాపకుల కొరత ఉంటే డిగ్రీ అధ్యాపకుల్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇంటర్ గుంటూరు ఆర్ఐఒ సునీత మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ఒకేషనల్ విద్యార్థులకు, 26న జనరల్ ఇంటర్ విద్యార్థులకు ప్రయోగపరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల వృత్తి విద్య అధికారి ఆంజనేయులు, మాజీ ఆర్ఐఒ జెడ్.ఎస్.రామచంద్రరావు, ప్రిన్సిపాల్స్ సంఘం అధ్యక్షులు ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాధికారులతో సమీక్షిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

హాస్టళ్లలో రేపు రాత్రి బస చేయండి

- గ్రామాల్లో నడిచి సమస్యలను గుర్తించాలి
- మండల ప్రత్యేకాధికారులతో పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆయా మండలాల ప్రత్యేకాధికారులు శుక్రవారం రాత్రి బస చేయాలని, విద్యార్థులతోనే కలిసి భోజనం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మండల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుండి తహశీల్దార్, ఎంఇఒ, ఎంపిడిఒ, సచివాలయ సిబ్బంది, ఎఇలు కలుసి గ్రామాల్లో ట్రాన్సిట్ నడక నిర్వహించి సమస్యలు గుర్తించాలని చెప్పారు. పారిశుధ్యం, విద్యార్థుల డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నడక చివరలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్ద క్లాప్ మిత్రలతో కలసి ముఖాముఖి నిర్వహించాలన్నారు. 'మిషన్ శుభకత్' కార్యక్రమంలో భాగంగా చెక్క, ప్లాస్టిక్, పేపర్, ఇనుము వ్యర్థాలను పోగుచేసి ఒకచోట దహనం చేయాలన్నారు. జిల్లా కార్యాలయం మాన్యువల్‌లోని నిబంధన ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లోని సామగ్రిని 16-23 తేదీల నాటికి

2లో

ఉత్సాహంగా మహిళా ఫెస్ట్

- ప్రత్యేక ఆకర్షణగా 'మనసులో మాటలు'
- తమ ఆలోచనలను వ్యక్తీకరించిన విద్యార్థినులు





8లో



ప్రభుత్వాస్పత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రభుత్వాస్పత్రుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. తాడేపల్లి పిహెచ్‌సి, మంగళగిరి అర్బన్ హెల్త్ సెంటర్, క్రోసూరు పిహెచ్‌సి, అచ్చంపేట పిహెచ్‌సిలను తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్ల నిర్వహణ, డాక్టర్ల హాజరు, పనితీరు, కాలం చెల్లిన మందుల వాడకం, మందుల పంపిణీ, వసతులు, సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీహరిరావు, లక్ష్మారెడ్డి, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, వాసంతి, ఎం.రామచంద్రయ్య, ప్రసాద్, సైదులు, కె.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్ : పట్టణంలోని కట్టెంపూడి అడ్డ రోడులో ఇద్దరు పిల్లలు తిరుగుతున్నారని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు పిల్లను తీసుకోని వచ్చి వారి సంరక్షణలో ఉంచారు. ఎస్‌ఐ భార్గవ్ పిల్లలను విచారించగా పిల్ల పేరు శైలు తండ్రి పేరు జంపన్న, బాబు పేరు హేమంత్ తండ్రి పేరు వెంకటరెడ్డి అని, కొత్తపల్లి గ్రామం అని తెలిపినట్లు తెలిపారు. ఇద్దరు పిల్లలు నేతాజీ నగర్‌కు చెందిన వాళ్లుగా గుర్తించి వారి అమ్మమ్మ వెంకటరమణకు అప్పగించి తగిన విధంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లల ఆచూకీ కనుగొనటకు సహకరించిన మీడియా మిత్రులకు ఎస్‌ఐ భార్గవ్ ధన్యవాదాలు తెలిపారు.



కెఎల్‌పిలో ఘనంగా క్రీడా వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో బుధవారం 37వ క్రీడా ముగింపు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని, కావున విద్యా ప్రణాళికలోనే క్రీడలు భాగంగా ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదుగుత ారన్నారు. ప్రిన్సిపాల్ వై.రథినిచౌదరి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థులను నాలుగు హౌస్‌లుగా విభజించి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

బాలబాలికలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి గణపతి నగర్ డాక్టర్ వైయస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని శాలివాహన నగర్ అంగన్వాడీ కేంద్రంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె ఆదేశాల మేరకు హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం బాల బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పీ అనూష బాలబాలికలకు ఎత్తు, బరువు, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అనంతరం బాలబాలికలకు ఐరన్ సిరప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, ఏఎన్‌ఎం విజయ కుమారి, ఆశా వర్కర్ లక్ష్మీకాంతం, అంగన్వాడీ టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు జీతాలు విడుదల చేయాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం జిల్లా డిఆర్‌ఒ చంద్రశేఖర్‌రావును కోరారు. ఈమేరకు బుధవారం సంఘ నాయకులు డిఆర్‌ఒకు వినతిపత్రం అందచేశారు. 8వ తేదీ వచ్చినా ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్లు అందలేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు, మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులకు, సహకార శాఖ ఉద్యోగులకు, ఆర్‌అండ్‌బి శాఖ ఉద్యోగులకు, జలవనరుల శాఖ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్, జ్యుడీషియల్ ఎంప్లాయిస్, కొంతమంది రెవెన్యూ ఉద్యోగులకు, వ్యవసాయ శాఖ ఉద్యోగులకు ఐటిటి ఉద్యోగులకు జీతాలు అందలేదని తెలిపారు. కావున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి



డిఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వేతనాలు విడుదల చేయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర సంయుక్త కార్యదర్శి భరత్‌కుమార్, కనకారావు, గురజాల సంఘ నాయకులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా నాయకులు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు

కోర్టు కేసులపై తగిన చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ప్రభుత్వ శాఖలకు సంబంధించి కోర్టులలో నమోదైన కేసులకు న్యాయమూర్తులు జారీ చేస్తున్న అదేశాల అమలుకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి జిల్లాలోని ప్రభుత్వ శాఖలకు సంబంధించి కోర్టులలో నమోదైన కేసులపై సమీక్ష నిర్వహించారు.డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివ రామిరెడ్డి, పంచాయితీ రాజ్ ఎస్‌ఈ బ్రహ్మయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, జిల్లా ఖజనా కార్యాలయం ఉపసంచాలకులు రాజగోపాల్, సాంఘీక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు,అధికారులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకం అంబేద్కర్ పేరుతోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-తెనాలి:జగనన్న విదేశీ విద్యాదీవెన పేరును తక్షణమే మార్చాలని, రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరునే పథకాన్ని కొనసాగించాలని పట్టణంలో టిడిపి నిరసన వ్యక్తం చేసింది. స్థానిక కొత్తపేటలోని కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి తహశీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. పేద విద్యార్థుల ద్రోహి జగన్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈమేరకు తహశీల్దార్ కార్యాలయం డిటి హెనిప్రియకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టి.హరి ప్రసాద్, కొల్లూరు శ్రీధర్, ఉప్పాల ఖన్నా, మహ్మద్ ఖుద్దూస్, కంచర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి:విదేశీ విద్యా పథకానికి అంబేద్కర్ పేరు రాష్ట్ర ప్రభుత్వం తొలగించడం పై టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరిలో నిరసన కార్యక్రమం జరిగింది. ప్రదర్శన నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా



తెనాలిలో వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో దళిత విద్యార్థులకు అన్యాయం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ నాయక(లు కే చిరంజీవి, భాగ్య రావు, ఎం వీరయ్య, పి ప్రేమ్ కుమార్, డి జ్యోతిబాసు, బి రామకృష్ణారావు, వెలగపాటి విలియం, టిడిపి రూరల్ అధ్యక్షులు తోట పార్థసారథి, తెలుగు యువత నాయకులు గోశాల రాఘవ, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మణికంఠకు పలువురు అభినందన

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



పట్టణంలోని పిబిఎన్ కళాశాలకు చెందిన యన్‌సీసీ విభాగం ఎన్ సీసీ క్యాడేట్ ఎన్ మణికంఠ దేశ రాజధాని ఢిల్లీలో జనవరి 26 నుండి 28 వరకు జరిగిన 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికై వేడుకల్లో పాల్గొని తన ప్రతిభను కనబరిచాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ ఎన్. శివకుమారి నేతృత్వంలో మణికంఠను అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించిన సందర్భంలో త్రివిధ దళాలతో పాటు ఎన్ సిసి క్యాడెట్లు ఇచ్చే గౌరవ వందనాన్ని స్వీకరించే కార్యక్రమంలో పిబిఎన్ కళాశాల విద్యార్థి పాల్గొనడం పొన్నూరు పట్టణానికి, తమకెంతో గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ శివకుమారి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీకాంత్, ఎన్‌సిసి కేర్ టేకర్ షేక్ నాగూర్ భాష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో నూట సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -ఏఎన్‌యు

నాగార్జున యూనివర్సిటీ అధ్యాపక సంఘం (నూట) సర్వసభ్య సమావేశం బుధవారం వర్సిటీలో జరిగింది. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని అధ్యాపకులు ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో అధ్యాపకుల సమస్యల గురించి చర్చించారు. ఈ సమావేశానికి నూట అధ్యక్షులు బి. నాగరాజు అధ్యక్ష వహించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ త్వరలో రాష్ట్రస్థాయి అధ్యాపకుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పదవీ విరమణ వయస్సు పెంపు, ఓపిఎస్, ఇతర అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. రెక్టర్ వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ నూట లక్ష్య సాధనలో విశ్వవిద్యాలయ అధికారులు ఎల్లప్పుడూ సహకరిస్తారని చెప్పారు. రిజిస్ట్రార్ బి.కరణ, సంఘపూర్వ అధ్యక్షులు జి సింహాచలం, ఆచార్య త్రిమూర్తి, ప్రధాన కార్యదర్శి ఆచార్య హరిబాబు, పూర్వ కార్యదర్శి స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలతో ట్రైనీ సబ్ కలెక్టర్ల సమావేశం

ప్రజాశక్తి -దుగ్గిరాల

డ్వాక్రా రుణాలు ఏ విధంగా వినియోగించు కుంటున్నారు.. రుణాలు తీసుకోకముందు మీ పరిస్థితి ఏంటి, ప్రస్తుతం ఎలా ఉన్నారు. జీవనోపాదులు సక్రమంగా అమలు జరుగుతున్నాయా అని ట్రైనీ సబ్ కలెక్టర్‌ల బృందం డ్వాక్రా గ్రూపులను విచారించాయి. బుధవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదర్శ మహిళ సమైక్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పొదుపు చేయడం తీసుకున్నా రుణాలు తిరిగి చెల్లించటం భీమా, చేదోడు తదితర పథకాలను గురించి వాకప్ చేశారు. డ్వాక్రా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో రేపు రాత్రి బస చేయండి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించి 28వ తేదీ నాటికి రవాణాకు సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. 3వ తేదీన వాటిని అనువైన ప్రదేశానికి తరలించాలని, 4న వేలం వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాతవాహనాలుంటే వేలానికి రవాణా శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మార్చి 16 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పాత భవనాలను గుర్తించాలని, పూర్తిగా శిథిలమైన వాటిని తొలగించాలని చెప్పారు. వివిధ సమస్యలపై వార్తా పత్రికల్లో వచ్చే వార్తలను గమనించి పరిష్కరించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఇకెవైసిని త్వరగా అప్‌లోడ్ చేయాలని, శ్లాబు వరకు పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి లబ్ధిదార్లకు అందించేలా పనులు పూర్తి చేయాలని చెప్పారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

బిఎస్‌ఆర్ పార్టీ వితరణ

ప్రజాశక్తి -ఫిరంగిపురం

ఆల్ ఇండియా కెసిఆర్ సేవాసదన్ బిఎస్‌ఆర్‌పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని స్థానిక మండలంలో గల నిర్మల్ హృదయ అనాథ ఆశ్రమంలో 50 మందికి, చర్చి ,రోడ్డు ప్రక్కన గల భిక్షాటకులకు 40 మందికి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బిఎస్ఆర్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు కవిలా.రాజేష్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమములో దినేష్ రిషి, వివేక్ రాజేష్ , సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలను సందర్శించిన జెసి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎత్తురోడ్డు సెంటర్‌లోని శ్రీ హజరత్ కాలే మస్తాన్ దర్గా 131వ ఉరుసు ఉత్సవాలు సందర్భంగా బుధవారం జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మస్తాన్ బాబా దర్గాను సందర్శించారు. గుంటూరులో కుల మతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీకగా జరుగుతున్న కాలే మస్తాన్ బాబా ఉరుసు మహెూత్సవాలలో ప్రజలందరు పాల్గొనాలని జిల్లా సంయుక్త కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి ప్రభాకర్ రెడ్డి, దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు, పాల్గొన్నారు.

పెదకోనేరులో బయటపడ్డ శివలింగాలు

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం పెదకోనేరులో పూడికతీత పనులలో కోనేరు లోపల బుధవారం శివలింగాలు బయటపడ్డాయి. దీంతో యాత్రికులు, పట్టణ ప్రజలు కోనేటిలోని శివలింగాలు చూసేందుకు తరలి వస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పట్టణంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవితో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామి వారిబ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా ఆలయం ఈవో ఏ. రామకోటిరెడ్డి తెలిపారు.

జిల్లా అదనపు కోర్టు ఏర్పాటుకు సహకరించాలి

నగరంలో నూతనంగా జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు చేయబోతున్న సందర్భంలో బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు 20మంది ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని కలసి నగరంలో జిల్లా అదనపు కోర్టు ఏర్పాటులో తమ వంతు సహాయ సహకారం అందించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, తోట నరసింహారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కె.చంద్రశేఖర్, న్యాయవాదులు బి. మధు, శీలం చైతన్య, జొన్నాదులు లెనిన్, మాచిరాజు గోవర్ధనరావు ఉన్నారు.

కేటాయించిన వాటా ప్రకారమే నీటి విడుదల

కృష్ణానదీ యాజమాన్య బోర్డు కమిటీ సభ్యుడు ఏ.అజయ్ కుమార్ గుప్త

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఏపీ-తెలంగాణ రాష్ట్రాలకు కేటాయించిన వాటా ప్రకారమే నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటివిడుదల ఉంటుందని కష్ణానదీ యాజమాన్య బోర్డు కమిటీ సభ్యుడు ఏ.అజయ్ కుమార్ గుప్త అన్నారు.కష్ణానదీ యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షణ కమిటీ ప్రాజెక్టు ఇంజనీర్లతో కలిసి బుధవారం ఆయన నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. మెయిన్ డ్యామ్,గ్యాలరీలు,ఎర్త్ డ్యామ్ ప్రాంతాలను పరిశీలించారు.అనంతరం కుడి,ఎడమ కాల్వలను పరిశీలించడంతో పాటు అన్నిచోట్ల ఏర్పాటు చేసిన టెలిమెట్రీలను వాటి పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా కష్ణానదీ యాజమాన్య బోర్డు కమిటీ సభ్యుడు ఎ.అజయ్ కుమార్ గుప్త మాట్లాడుతూ తాను నూతనంగా కేఆర్ఎంబీలో సభ్యునిగాచేరడంతో అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు తెలిపారు.ఆయన వెంట కెఆర్ఎంబీ సూపర్నెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఈఈలు శివశంకరయ్య,రాఘవేంద్రరావు, కుడికాలువ ఎస్ఈ వరలక్ష్మి, కుడికాలువ మెయిన్ కెనాల్ ఈఈ మురళీధర్, కుడికాలువ ఒఅండ్ఎం డివిజన్ మాచర్ల ఈఈ శ్రీహరి, డీఈలు లింగమూర్తి, మురళీధర్, శ్రీనివాస్,ఏఈఈలు బాబుమియా,భారతి,సుధ,ఏఈలు ఖాశీం, యుగంధర్, సాగర్ డ్యాం ఈఈ మల్లిఖార్జునరావు, వెంకటసుబ్బయ్య, సుదర్శన్, శ్రీనివాస్, ఏఈ కష్ణయ్య తదితరులు ఉన్నారు.

వీధి లైట్లు మారుస్తుండగా ఎలక్ట్రీషియన్ మృతి

ప్రజాశక్తి-నకరికల్లు



విద్యుత్ షాక్ తగిలి ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మండలంలోని కుంకులగుంటలో చోటుచేసుకుంది. పోలీసులు, అతని కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం, కుంకుల గుంట పంచాయతిలో టెండర్ పద్ధతిలో గ్రామానికి చెందిన మాదినీడు. శ్రీనివాస రావు(53) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు న్నాడు. గత సంవత్సరం ఏప్రిల్ 1న జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు టెండర్ పద్ధతిలో నియా మకం పొందినట్లు తెలిపారు. బుధవారం ఉదయం గ్రామం లోని పంచాయితి వీధిలైట్లు మారుస్తుం డగా విద్యుత్ షాక్ తగిలి పై నుంచి కింద పడ డంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుని పెద్ద కుమార్తె శ్రీ శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కోటే శ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్య శాలకు తరలించారు. శ్రీనివాసరావుకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి -మేడికొండూరు

మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫోక్సో కేసు నమోదైంది. మండలంలోని డోకిపర్రుకు చెందిన బాలుడు, బాలికను తీసుకొని వెళ్ళిపోయాడు. బాలిక తల్లి దండ్రులు ఈ మేరకు మేడికొండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన పోలీసులు బుధవారం ఫోక్సో కేసు నమోదు చేశారు.

బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి-దుగ్గిరాల

బాలికను ప్రేమించి, మోసం చేసి ఆపై ఆమెను ఆత్మహత్య కారణమైన సంఘటన మండలంలోని గొడవర్రులో చోటు చేసుకున్నది. బహుజంకు జయలక్ష్మి (17) అదే గ్రామానికి చెందిన కనపాల అనిల్ కుమార్ అనే యువ కుడిని ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అంతేకాదు 'నువ్వు చనిపోయినా నిన్ను మాత్రం పెళ్లి చేసుకోను' అని ఆమెకు తెగేసి చెప్పాడు. దీంతో మనస్థాపం చెందిన బాలిక మంగళవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సుమతి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎ. శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం పోస్టుమార్టం నిర్వ హించి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ కు మూడు అవార్డులు

ప్రజాశక్తి-వినుకొండ : పట్టణానికి చెందిన చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్‌ను మూడు అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. కోన సీమ చిత్రకళ పరిషత్ అమలాపురం వారు అం తర్జాతీయ స్థాయిలో నిర్వహించిన చిత్రకళ పోటీలలో 2020- 2021-2022 సంవ త్సరాలకు గాను వరుసగా మూడు "అమ రావతి చిత్రకళారత్న" గోల్డెన్ లోటస్" అవా ర్డులు అందుకొని చరిత్ర సష్టించారు. ఈ సంద ర్భంగా వినుకొండకు చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖులు, పాస్టర్లు, కవులు, కళాకారులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పలు సంస్థల వారు జస్టిస్ ను అభినం దించారు. మరెన్నో అంతర్జాతీయ అవార్డులు సాధించాలని అభిలషించారు



ఆర్‌వోబిలకు ఎంపిల వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైల్వే గేట్ల వద్ద ఆర్ఓబీలను మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయులు, గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ వేర్వేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు రైల్వే గేట్ల వద్ద ప్రజలు పడుతున్న ఇబ్బందుల దష్ట్యా అత్యవసరంగా ఆర్ఓబీలు, ఆర్‌యూబీలు మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని కేంద్ర రోడ్లు, రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని అభ్యర్థించారు. ఈ మేరకు ఇరువురు ఎంపిలు మంత్రికి లేఖ రాశారు. నరస రావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో సత్తెనపల్లి నుండి మాదిపాడు వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మించాలని కోరారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో గుంటూరు-నల్లపాడు మధ్యలో ఆర్ఓబీ అత్యవసరంగా నిర్మించాల్సి ఉందని మంత్రికి విన్నవించారు.



మాదలలో ఆధార్ సేవలు


ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆధార్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు,గ్రామంలోని ప్రజ లకు ఆధార్ నమోదు, ఆధార్ లో తప్పులు, మార్పులు,చేర్పులు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆధార్ అపరేటర్, ముప్పాళ్ల గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విజయ మాట్లాడుతూ నెలలో నాలుగు రోజులు గ్రామాల్లో ఆధార్ సేవలు అందించడం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులతో పాటు గ్రామాల్లో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవచ్చని తెలిపారు. మాదల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రమేష్, పంచాయతి కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-వినుకొండ

నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ నిర్మాణ మహాసభలు బుధవారం కార్యాలయంలో జరిగాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద నుంచి శివయ్య స్థూపం వరకు వందలాదిమంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పులుపుల వెంకట శివయ్య భవన్లో మహాసభ నిర్వహించారు. బుదాల సాగర్ బాబు అధ్యక్షతన జరిగిన మహా సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ జి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ప్రతి ఒక్క పేద విద్యార్థికి ఉన్నతమైన విద్యనందిస్తానని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పేద విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా చేస్తున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చినటువంటి నూతన జాతీయ విద్యా విధానాన్ని దేశవ్యాప్తంగా ఉన్న బిజెపి అధికారం ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయట్లేదని మన ముఖ్యమంత్రి మాత్రం అమలుపరుస్తున్నారని విమర్శించారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,10,553
మిర్చి ఎగుమతి	: 1,15,904
మిర్చి నిల్వ	: 76,868

మిర్చి ధరలు

	రూపాయలలో
334	7,500 - 21,500
నెం.5	14,500 - 19,200
273	11,000 - 18,000
341	8,000 - 21,500
4884	9,000 - 16,000
సూపర్ 10	10,800 - 19,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 19,500
బడిగి	9,000 - 25,000
దేవనూరు డీలక్స్	6,000- 20,000
తాలుకాయలు	4,500 - 12,000

రైతులు, కార్మికులకు నష్టం చేస్తున్న బిజెపి

- కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ
- జయప్రదానికి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల,నూజెండ్ల

రైతులు, కార్మికులకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శులు వై.గోపాలరావు, ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పిడుగురాళ్ల పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లోని కన్నెగంటి హనుమంత భవన్‌లో, మండల కేంద్రమైన నూజెండ్లలో సదస్సులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు దక్కక వ్యవసాయం సంక్షోభంలో పడిందని, దీనికితోడు ఇటీవల కేంద్ర బడ్జెట్లోనూ వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించిందని అన్నారు. కార్మికులు బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చేలా లేబర్ కోడ్‌లను తెచ్చారని అన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు వ్యవసాయ కార్పొరేటీకరణ, భూసేకరణ చట్టం-2013 అమలు, భూమిలేని వ్యవసాయ కుటుంబానికి రెండెరాల సాగుభూమి, పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం, రైతులకు రుణవిముక్తి చట్టం, 60 ఏళ్లు నిండిన వ్యవసాయ దార్లకు పించను, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.10 వేలు, వ్యవసాయ కార్మికుల సమగ్ర రక్షణ చట్టం, లేబర్ కోడ్‌ల రద్దు, విద్యుత్ వరణ చట్టం రద్దు, స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ, సామాజిక అణచివేతకు గురవుతున్న వారిపై దాడుల నివారణ, ఇతర అంశాల్లో 17 డిమాండ్ల సాధన కోసం చేపట్టే చలో ఢిల్లీలో అన్ని రంగాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సదస్సుల్లో నాయకులు బి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, టి.సుబ్బయ్య, బి.వెంకటేశ్వర్లు, జి.సుందర్‌రావు, సలోమను, జగన్నాథం, నరసమ్మ, జె.అవచ్చమ్మ, మేరిగ్రేసేస్, ఎస్.వెంకటకృష్ణ, కె.హనుమంతరెడ్డి, టి.శివరామకృష్ణ, జి.పద్మ, సలోమి, సీతారామయ్య , జి.ఏసురత్నం పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో మాట్లాడుతున్న వై.గోపాలరావు



నూజెండ్లలో మాట్లాడుతున్న ఎ.లక్ష్మీశ్వరరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జెసి శ్యాంప్రసాద్

భూ రీసర్వేపై జెసి సమీక్ష

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం సందర్శించారు. తహశీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, ఇతర అధికారులతో సమావేశమై మండలంలో చేపట్టిన భూరీసర్వేపై సమీక్షించారు. నరసరావుపేట సర్వే డిఐ పార్థసారథి, మండల సర్వేయర్ రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

15 వరకూ నవోదయ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి - రెంటచింతల

జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాల కోస దరఖాస్తు గడువును పెంచినట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకూ దరఖాస్తు తేదీని పొడిగించామని, విద్యార్థులు, తల్లిదండ్రులు దీన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



బాలింతకు ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న డాక్టర్ వెంకట్రావు

ఏరియా ఆస్పత్రిలో అన్ని విభాగాల్లోనూ వైద్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

స్థానిక ఏరియా వైద్యశాలలో అన్ని విభాగాల్లో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో గతంలో ఆరోగ్యశ్రీ గర్భిణులకు మాత్రమే పరిమితం కాగా ఇప్పుడు అన్ని రోగాలకూ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అన్ని విభాగాలకు వైద్యులున్నారని, రోగులు వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఒకరికి ఆరోగ్యశ్రీ కార్డును అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కె.రామకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అదానీకి దోచిపెడుతున్న మోడీ : కాంగ్రెస్

ప్రజాశక్తి - మాచర్ల

ఆదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంట్ కమిటీ వేయాలనే దేశ ప్రజల డిమాండ్‌ను ప్రధాని మోడీ ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును అదానీకి దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం పని చేస్తోందని, బంగ్లాదేశ్, శ్రీలంక, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో ఆదాని వ్యాపారం చేసేందుకు స్వదేశీ బ్యాంకులతో రుణాలు ఇప్పించటం దారుణమని విమర్శించారు. బ్యాంక్‌ల దివాళాకు, వాట నష్టాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమన్నారు. సమావేశంలో నాయకులు జి.పుల్లారెడ్డి, సిహెచ్ వెంకటేశ్వర్లు, నాగరాజు, జివి సత్యనారాయణ పాల్గొన్నారు.



అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్, డిఎంహెచ్ఒ తదితరులు

కుష్టు బాధితుల పట్ల వివక్ష వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కుష్టు రోగుల పట్ల వివక్షతను చూపొద్దని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. కుష్టు నివారణపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుష్టు రోగులను జనజీవన స్రవంతిలోకి తీసు కురావటానికి జిల్లాలో ఉన్న అన్ని వనరులను ఉపయోగించుకుంటామని చెప్పారు. కుష్టు వ్యాధితో పోరాడుదాం.. కుష్టు వ్యాధిని గత చరిత్రగా మార్చేద్దాం.. అని ప్రతిజ్ఞ చేయించారు. దీనిపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ఈనెల 13వ తేదీ వరకూ వరకు అన్ని పంచాయతీ స్థాయిలలో నిర్వహించాలని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి మాట్లాడుతూ స్పర్శ లేని తెల్ల మచ్చలు, లేదా రాగి రంగు మచ్చలు, లేదా చేతులు కాళ్లు ఏమైనా వైకల్యం ఉన్నా, కండరాలు బలహీనంగా ఉన్నా, కనురెప్పలు పూర్తిగా మోయలేకున్నా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు. అనంతరం అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు.

15-21 తేదీల్లో బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లపై ఎమ్మెల్యే శంకరరావు సమీక్ష - పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి

శివరాత్రి సందర్భంగా ఈ నెల 15-21 తేదీల్లో అమరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఉత్సవాల విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. సందర్శకులకు ఇబ్బందులేమీ రాకుండా ఏర్పాట్లు చేయాలని, స్నానాలకు, ఇతర వసతులు రాజీలేకుండా కల్పించాలని ఆదేశించారు. 18వ తేదీన శ్రీబాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం, 20న రథోత్సవం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజకుమారి, తహశీల్దార్ విజయశ్రీ, ఎంపిడిఒ పి.మాధురి, ఇఒ సునీల్ కుమార్, జెడ్‌పిటిసి ఇ.కరుణకుమారి, ఎన్.విజయసాగర్‌బాబు, సర్పంచ్ రాజేశ్వరి హష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యుటిఎఫ్ అచ్చంపేట మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అచ్చంపేట

యుటిఎఫ్ మండల కార్యదవర్గ సమావేశం మండల కేంద్రమైన అచ్చంపేటలోని జెడ్‌పి పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా టి.శౌరిరెడ్డి, అధ్యక్షునిగా కె.ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకటేశ్వరరావు, సహాధ్యక్షులుగా వి.సత్యనారాయణ, కె.లలిత, కోశాధికారిగా కె.నాగరాజు, కార్యదర్శులుగా ఎస్‌కె పెదహుస్సేన్, పి.భార్గవ్, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌కె బాష, జి.బాలశౌరిరెడ్డి, కె.రాజేంద్ర, వివి.లక్ష్మి, బద్రు నాయక్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎం.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్‌కె ఖాజావలి, పి.సుజాత ఎన్నికయ్యారు. నూతన కమిటీకి ప్రేమ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి యు.రాజశేఖర్ మాట్లాడారు. ఎన్నిక అధికారిగా శేషగిరి, పరిశీలకులుగా నరసింహారెడ్డి వ్యవహరించారు.



వెంకటేశ్వరరావు, ప్రకాశరావు, శౌరిరెడ్డి

వివరాలు పంపని వాలంటీర్లను తీసేయండి

కొందరు అధికారులు సరిగా స్పందించడం లేదు : ఎంపిపి

ప్రజాశక్తి - మాచర్ల

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికా రులకు ఎంపిపి బి.మంగమ్మ చెప్పారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించగా అధ్యక్షత వహించిన ఎంపిపి మాట్లాడుతూ కొన్ని విషయాల్లో కొంతమంది అధికారులు సరిగా స్పందించడం లేదని చెప్పారు. గడప గడప కార్యక్రమానికి హాజరవ్వని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదార్ల వివరాలు ఎమ్మెల్యే కార్యాలయానికి కొంతమంది వాలంటీర్లు ఇంకా పంపలేదని, రెండ్రోజుల్లోగా పంపకుంటే వారిని తొలగించాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఎఇ మాట్లాడుతూ 200లోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్ బిల్లు ఉండదని చెప్పారు. ఎంఇఒ వి.నాగయ్య మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉందని, బదిలీ ప్రక్రియ పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ సరఫరాలో సమస్యలపై ప్రజాప్రతినిధులు పలువురు సమావేశంలో ప్రస్తావించారు. జడ్‌పిటిసి పెదమల్లుస్వామి, ఎంపిడిఒ కోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి మంగమ్మ



తాడేపల్లి సదస్సులో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్



కొల్లిపర సదస్సులో మాట్లాడుతున్న వై .నేతాజీ

నాటి రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో 5న చలో ఢిల్లీ

తాడేపల్లి, కొల్లిపర ప్రజాసంఘాల సదస్సుల్లో నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి : దేశంలోనే గాక ప్రపంచదృష్టిని ఆకర్షించి, ప్రధాని మోదీ మెడలు వంచిన నాటి రైతాంగ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుదామని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం తాడేపల్లి లోని మేకా అమరారెడ్డి భవనంలో రైతు సంఘం, కౌలు రైతు సంఘం,సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు కాజా వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమిద్దామని పిలుపు నిచ్చారు.ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కదలాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా నాడు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి స్థాయికి అబద్ధాలు మాట్లాడటం క్షంతవ్యం కాదన్నారు. మూడు నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం, కార్యాచరణలో అమలు జరపడం లేదని విమర్శించారు. రైతుల పంటపొలాల మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించడం ఉపసంహరించుకోవాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం రైతులు, కౌలు రైతులు, అసంఘటితరంగ కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున్న పాల్గొనాలని కోరారు. సదస్సులో ప్రజా సంఘాలనాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు. పి.కృష్ణ, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కె.కిశోర్, సంసోన్, ఎం.దుర్గా రావు, కె.బాబూరావు, కె.కరుణాకర్‌రావు, శివనాగేశ్వరరావు, పి.రామచంద్రరావు, కె.ప్రభాకర్‌రావు, బి.రామారావు, వీరాస్వామి, టి.శివకృష్ణ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొల్లిపర : కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు, ప్రభుత్వ రంగ పంస్థల పరిరక్షణకు ఏప్రిల్ 5న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలి రావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. మండల కేంద్రం కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్ అద్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ఎల్ఐసి, రైల్వే, బ్యాంకులు ప్రైవేటీకరణకు పూనుకుంటుందని, ఫలితంగా యువతకు ఉపాది అవకాశాలుండవన్నారు. కోట్లాది రూపాయలకు కార్పోరేట్లకు కట్టబెడుతున్నారని, అదాని, అంబానీలకు 11 లక్షల కోట్లు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు కనీస వేతనం రూ.26వేలు, కనీస పించన్ రూ.10వేలు, ఉద్యోగ నియామకాల్లో కాంట్రాక్టు పద్దతికి స్వస్థి పలికి, రెగ్యులర్ ప్రాతిపకన చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అలాగే స్కీం వర్కర్ల సర్వీసును క్రమబద్ధీకరించి, ఫించన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయా డిమాండ్లతో ఏప్రిల్ 5న చేపట్టే ఛలో ఢిల్లీని జయప్రదం చేయాలన్నారు. . సమావేశంలో ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ఎం.జయప్రద, కె.భవాని, దీప్తి, మల్లోల రమేష్ , జిలుగు ముక్కంటి, గోదా ఏసుపాదం, ములకా శివకుమారి, జి.రామయ్య పాల్గొన్నారు.

11న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఈనెల 11న జరిగే యుటిఎఫ్ 48వ జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పిలుపునిచ్చారు. బుధవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాల యంలో సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ విధానాలపై చర్చించి, అనేక తీర్మానాలను సమావేశంలో ఆమోదించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, సిపిఎస్ కన్వీనర్ సిహెచ్ ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు ఎండి.షకీలాబేగం, జి.వెంకటేశ్వర్లు, ఎం.గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు గురుబ్రహ్మం, కె.రంగారావు, ఎన్.ధనరాజారావు, కె.ప్రేమ్‌సాగర్, ప్రసాద్, రమేష్, ప్రభుజీ, బాజీబాబా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

12న బిపి మండల్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

వెనుకబడిన తరగతుల సమస్యపై పోరాడిన బిపి మండల్ కాంస్య విగ్రహాన్ని ఈనెల 12న గుంటూరులో ఆవిష్కరించబోతున్నట్లు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. బుధవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని తొలిసారిగా గుంటూరులో బిపి మండల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల బిసి సంఘ నాయకులు హాజరవుతున్నారని, కావున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అదే విధంగా ఈనెల 10వ తేదీన మంగళగిరిలో బిసి రిజర్వేషన్ల సాధన కోసం మండల్-2 ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణాలో వేలాది మందితో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా బిసిలకు జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు దక్కట్లేదన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో ఇస్తున్న 33 శాతం రిజర్వేషన్లను కూడా కుదించారన్నారు. పాలకులు మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకపోవటం వల్లనే మండల్-2 ఉద్యమం ఆవిర్భవిస్తుందని, దీనికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని, బిసి కులగణన చేపట్టాలని, తదితర సమస్యలపై భవిష్యత్‌లో జరిగే ఆందోళనల్లో బిసిలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నాగమల్లేశ్వరరావు, స్టేట్ ట్రెజరర్ కన్న మాస్టారు, వర్కింగ్ ప్రెసిడెంట్ తన్నీరు ఆంజనేయులు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు నిమ్మల శేషయ్య, బిసి ఉద్యోగలు సంఘం అధ్యక్షులు పి.హనుమంతరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వరరావు, కోలా అశోక్ పాల్గొన్నారు.

చేనేతల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి

ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి

ప్రజాశక్తి - మంగళగరి రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా రాష్ట్రంలో చేనేతల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తానని ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి స్పష్టం చేశారు.ఎంటిఎంసి పరిధిలోని ఎర్రబాలెం వద్ద గల ఆప్కో డీఎంవో కార్యాలయం, ఆప్కో గోదామును బుధవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గోదాములోని వస్త్ర నిల్వలను పరిశీలించారు. వస్త్రాల నాణ్యతను స్వయంగా పరిశీలించి, ఏళ్ల తరబడి చీరలు, ఇతర వస్త్రాలు ఎందుకు నిల్వ వున్నాయని అధికారులను ప్రశ్నించారు. విలువైన చేనేత వస్త్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని, గోదామును పరిశుభ్రంగా వుంచాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ చిరంజీవి విలేకర్లతో మాట్లాడుతూ చేనేత కళాకారులు నేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి, కార్మికులకు నిరంతర ఉపాధిని అందించడమే లక్ష్యంగా ఆప్కో ఆవిర్భవించిందన్నారు. దేశంలో ఏ



ప్రభుత్వమూ చేయని విధంగా నవరత్నాల పథకంలో మిగతా వర్గాల కంటే ఎక్కువగా చేనేత కార్మికులకు అత్యధికంగా నేతన్న నేస్తం పేరిట ప్రతి సంవత్సరం రూ.24 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు వ్యాపారులకు ధీటుగా ఆప్కో షోరూములను అభివృద్ధి చేసి, వినియోగదారులకు నాణ్యమైన, మన్నికతో కూడిన వస్త్రాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆప్కో డీఎంవో ఉమాశంకరరావు, లివరీ మార్కెటింగ్ ఆఫీసర్ బి.నాగేశ్వరరావు, గోదాము ఇనచార్జి దామర్ల వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జియోట్యాగింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కృషి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్ వారు జియో ట్యాగింగ్ విధానంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాస్త్రవేత్తలు అంజుమెహతాబ్, శ్యామ్ సుందర్ భువన్ పోర్టల్‌లో ఆర్‌కెవివై పరికరాలను, ఆస్తులను, మౌళిక సదుపాయాలను జియోట్యాగింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈశిక్షణలో అదనపు వ్యవసాయ సంచాలకులు, ఆర్‌కెవివై నోడల్ ఆఫీసర్ వివి విజయలక్ష్మి, వ్యవసాయ, అనుబంధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెహతాబ్



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

పేదలకు కార్పొరేట్ తరహా వైద్యం

అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-తెనాలి:

పేదల సౌకర్యార్థం వైద్య ఆరోగ్య శాఖలో గణీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేటలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలలను మరింత బలోపేతం చేస్తుందని, కార్పోరేట్ తరహాలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తెస్తుందన్నారు. సిబ్బంది నియామకాలు ఎప్పటికప్పుడు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. పేదలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, దానిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఇంటి ముంగిటికే వైద్య సేవలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలుతోపాటు ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం, కమిషనర్ ఎం.జస్వంతరావు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ హనుమంతరావు, జిల్లా ఉపవైద్యాధికారిణి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, తహశీల్దార్ కె.రవిబాబు, డిపిఎంఓ సిహెచ్ రత్నమోహన్, స్థానిక నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికునికి నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎంటిఎంసి పరిధిలోని పారిశుధ్య కార్మికుడు, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ మంగళగిరి పట్టణ నాయకులు చేవూరి వెంకయ్య మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వెంకయ్య భౌతిక కాయానికి సిఐటియు నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పి రామచంద్రరావు, వై కమలాకర్, యన్నం శివనాగేశ్వరరావు, కటారి శ్రీనివాసరావు, అంజిబాబు, దళాయి అంజమ్మ, కటారి శివ నాగేశ్వరమ్మ, పెద్దఎత్తున కార్మికులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సమయపాలన అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు : కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి బిటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థుల ఆలోచన ధోరణులు, అలవాట్లు, సాధనకు అవసరమైన సమయ నిర్వహణ నైపుణ్యాలు, విలువలతో కూడిన జీవనశైలి అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ బుధవారం నిర్వహించారు. యుక్త వయస్సులో ఆకర్షణల గురించి, వాటి వల్ల కలిగే నష్టాల గురించి, బయటపడే మార్గాల గురించి తెలియజేశారు. విద్యార్థులు కుటుంబం పట్ల విలువలు, బాధ్యతతో మెలగాలన్నారు. ఈవర్క్‌షాప్‌లో ఇంపాక్ట్ ఫౌండేషన్ నుండి మోటివేషనల్ ట్రైనర్ సిహెచ్.వీరాంజనేయులు, వెంకట్ కొల్లూరు, జాస్తి రాజేశ్వరి, దీపా అగర్వాల్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశ నిర్దేశం చేశారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఐటి విభాగాదిపతి డాక్టర్ ఎం.ఎస్.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంకా అందని జీతాలు!

- ప్రభుత్వ ఉద్యోగస్తుల్లో ఆందోళన
- జనవరి జీతం కోసం ఎదురుచూపులు
- సకాలంలో జీతం ఇవ్వాలని ఉద్యోగస్తుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

'ఉద్యోగులు ఖచ్చితమైన సమయం పాటించాలి.. ముఖఆధారిత హాజరు తప్పని సరి' అని చెబుతున్న ప్రభుత్వం, ఉద్యో గులకు సమయానికి జీతాలు ఇవ్వాల్సిన అవసరం లేదా అంటూ ఇంతవరకూ జీతాలు అందుకోని వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు విమర్శలు గుప్పిస్తున్నారు. చిలకలూరిపేట పట్టణ,నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో వేల సంఖ్యలో ఉద్యోగస్తులు పని చేస్తున్నారు ఇందులో సగానికి పైగా ఉద్యోగస్తులకు జన వరి జీతం.. ఫిబ్రవరి 8వ తేదీ వరకూ రాలేదు. జీతాలు బ్యాంకుఖాతాలకు ఇంత వరకూ జమ కాక పోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉపా ధ్యాయుల్లో దాదాపు సగం మందికి పైగా జీతాలు సరైన సమయంలో రావటం లేదు. జీతాలు ఎందుకు ఆలస్య మవుతున్నాయని అడిగే సాహసం కూడా చేయలేక పోతున్నామని కొందరు, ఈ విషయం గురించి ప్రస్తావిస్తే ఏమవుతోందనని భయపడుతున్నామని మరికొందరు చెబుతున్నారు. వ్యవసాయ శాఖలోని ఉద్యోగుల పరిస్థితి కూడా ఇంతే. హౌసింగ్ డిపార్టుమెంట్‌లోని కొంత మంది ఉ న్నతాధి కారులు తమకు జీతాలు, కార్లకు , గూడెం అద్దె బిల్లులు రా లేదని చెబుతున్నారు. వెలుగు తదితర కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగస్తులను జీతాల విషయమై ప్రశ్నిస్తే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సేవల విభాగంలో పని చేసే 108,104 సిబ్బంది కూడా జీతం కోసం ఎదురుచూపులు తప్పట్లేదం టున్నారు. మున్సిపల్ చెత్త ఆటో డ్రైవర్లకు నాలుగైదు నెలలుగా జీతాలు సరైన సమయంలో వేయడం లేదు. ఎప్పుడు ఇస్తారనే విషయంలో అధికారుల్లో స్పష్టతా లేదు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియటం లేదని పలువురు ఉద్యోగస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగన్ ప్రభుత్వంలోని సచివాలయ ఉద్యోగస్తులకు కూడా ఇంత వరకు జీతాలు అందలేదు. ఇప్పటికైనా రా ష్ట్ర ప్రభు త్వం తమపై వేధింపులు, కక్ష సాధింపు చర్యలు మానుకొని సకాలంలో జీతాలు ఇవ్వాలని ఉద్యోగస్తులు వేడుకుంటున్నారు.



మండలంలో సమస్యలపై దృష్టి పెట్టండి

ఎంపిపి గడ్డం బాలనాగమ్మ

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎంపిపి గడ్డం బాలనాగమ్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎండిఒ కె.మ్యాథ్యూబాబు అధ్యక్షత వహించారు. ఎంపిపి మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పొలం పనులు ముగిసిన అనంతరం ఉపాధి హామీ పథకం కింద అర్హులైన వారందరికీ పనులు కల్పించాలని అన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తహశీల్దార్ జి.అంకారావు మాట్లాడుతూ రైతులు తమ పొలాలను వెబ్ ల్యాండ్ లో నమోదు చేసు కోవాలని అన్నారు. వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు.

గోడౌన్ నిర్మాణానికి అనుమతులు రద్దు చేయండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రంలోని తహశీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాల వద్ద గల జలవనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలోని సహకార సంఘం గోడౌన్ నిర్మాణ అనుమతిని రద్దు చేయాలని ఫ్రెండ్స్, వావిలాల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కలెక్టర్ శివశంకర్‌కు అటవీ శాఖ అధి . కారి ఎన్.రామచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ విషయాన్ని సంస్థ సభ్యులు తోట ఆంజనేయులు,పున్నా శ్రీను, దర్వేష్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సుమారు అరవైఏళ్లున్న నేరేడు, చింత,అశోక,కొబ్బరి ఇలా పలు రకాల చెట్లు వనాన్ని తలపించేలా ఉన్నాయని, వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఈ చెట్ల నీడలో సేద తీరే వాతావరణం ఇక్కడ ఉందని చెప్పారు. చెట్లు నరికి గోడౌన్ నిర్మాణం చేయాలన్న చర్యలు తగవని, వ్యతిరేకిస్తున్నామని సంస్థ సభ్యులు తెలిపారు. గోడౌన్ నిర్మాణానికి సంబంధించి అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు



ఎన్.సి.సి క్యాడెట్‌కు సన్మానం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో మంది విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించిన శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్ కుందుర్తి కిషోర్ ను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కళాశాలకు చెందిన విద్యార్థి కుందుర్తి కిషోర్ గత నెల 26 న న్యూఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికై అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఉన్నత అధికారుల చేత గుర్తింపు పొందాడు. ఈ నేపథ్యంలో బుధవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కిషోర్ ను కళాశాల అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపాల్ సోము మల్లయ్య, ఎన్‌సిసి మేజర్ బిఎస్ఆర్కే రాజు ఘనంగా సత్క రించారు.

పాఠశాలల అభివృద్ధి పనుల ఫోటోలు అప్‌లోడ్ చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధికి చేస్తున్న పనులను ప్రతి సోమవారం ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో లోడ్ చేయాలని ఎంఈఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండలాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులు చేసిన పనులను ప్రతి సోమవారం సాయంత్రానికి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. తద్వారా పనుల పురోగతిని అంచనా వేయవచ్చుని, ఫోటోలు అప్‌లోడ్ చేసే కార్యక్రమంలో జిల్లాను ప్రథమ వరసలో ఉంచేలా కృషి చేయాలని అన్నారు. జిల్లాలో ఇంకా 2,961 మంది బడి బయట పిల్లలు ఉన్నారని, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఆయా పిల్లలను సంబంధిత పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే విధంగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటప్పయ్య , ఎపిడబ్ల్యుఐడిసి రమేష్ , పిడి, డి ఆర్ డిఎ బాలు నాయక్, సర్వ శిక్ష అభియాన్ డిఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బోయపాలెంలో 'గడప గడపకు'

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బోయపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేం ద్రప్రసాద్, వైస్ చైర్మన్ ఎం.




వీరారెడ్డి,ఎంపిపి పి.ఝాన్సీ, వైస్ ఎంపిపి నాజుల, మండల పార్టీ నాయకులు జి.శంకర్, చింతారావు శివరామకృష్ణ, సర్పంచ్ వి.నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాం

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలో జఠిలమైన తాగునీటి సమస్యను పరిష్కరించగలిగామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక ఆరవ సచివాలయ పరిధిలోని తిమ్మాయపాలెం రోడ్డులో బుధవారం జరిగింది. ఇంటింటికి తిరిగి నవరత్నాలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించి, ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాగునీటి



సమస్య రాష్ట్రంలో ఎక్కడైనా ఉందా అంటే అందరికీ వినుకొండ గుర్తొచ్చేదని, ప్రస్తుతం ఆ సమస్యను పరిష్కరించామని తెలిపారు. వినుకొండ పట్టణాన్ని మోడల్ పట్టణంగా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.



'హలో నేస్తం' ఉచిత బస్ సర్వీస్ ప్రారంభం

ప్రజాశక్తి-మాచవరం

మండలంలోని రేగులగడ్డలో బుధవారం 'హలో నేస్తం- మీ ఆరోగ్యం మా భరోసా' కార్యక్రమాన్ని పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అశోక్ కుమార్ జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పేదలకు అండగా వుండే ఉద్దేశంతో గ్రామంలో మూడవ విడతగా ఉచిత బస్ సర్వీస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి బుధవారం రేగులగడ్డలో బస్ మొదలై వేమవరం, తురక పాలెం, మాచవరం, గంగిరెడ్డిపాలెం, గాంధీ నగర్ గ్రామాల మీదుగా పిడుగు రాళ్లలోని పల్నాడు హాస్పిటల్స్‌కు చేరుకుంటుందన్నారు. హాస్పిటల్స్‌కు వచ్చే రోగులకు రూ.5కు భోజనం పెడతామని చెప్పారు. ఆరోగ్య శ్రీ ద్వారా 30 నుండి 50 శాతం వరకు రాయితి సదుపాయాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 'హలో నేస్తం' ద్వారా రకరకాల ఆపరేషన్లను ఉచితంగా, రాయితితో చేస్తామని చెప్పారు. రోగులు వైద్యపరీక్షల అనంతరం వారిని బస్‌లోనే ఇంటికి పంపిస్తామని అన్నారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఆరోగ్యాలను మెరుగు పరచు కోవాలని సూచించారు. తొలుత గ్రామపెద్దలు, వైద్యులు అశోక్‌కుమార్‌ను దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రేగులగడ్డ సర్పంచ్ అలవాల లక్ష్మిస్వామి, వైస్ ప్రెసిడెంట్ జక్కుల వెంకాయమ్మ, చెన్నాయిపాలెం మాజీ సర్పంచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

'వాణిజ్య వాహనాల యజమానులు ట్యాక్స్ చెల్లించలేదు'

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని పాలువాయి జంక్షన్ లో వివిధ వాహనాలను తనిఖీ చేసి, అపరాధ రుసుం కింద రూ.15 వేలు వసూలు చేసినట్లు మాచర్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషి రెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, ఓవర్ లోడ్ కారణంగా జరిమానా విధించినట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో 79 మంది వాణిజ్య వాహనాల యజ మానులు మూడు నెలల ట్యాక్స్ చెల్లించలేదని, తక్షణమే చెల్లిం చాలని లేనిపక్షంలో తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించండి

ప్రజాశక్తి - యడ్లపాడు

నాయీ బ్రాహ్మణులకు దేవాలయ పాలక మండలిలో సభ్యుడిగా తప్పని సరిగా ఇవ్వాలన్న సిఎం జగన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే, దీని ద్వారా తమకు చేకూరే ప్రయోజనమేమీ లేదని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాదెండ్ల సుందరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయంలోని కేశఖండశాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులను ఉద్యోగస్తులుగా గుర్తిస్తామని, వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని నాడు ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా చేసిన హామీని మరిచారా అని ప్రశ్నించారు. మూడున్నరేళ్ల పాలనలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా పాలకమండలిని అలంకారప్రాయంగా చేశా రని విమర్శించారు. నాయీ బ్రాహ్మణులకు ఏదైనా మేలు జరిగిం దంటే, అది కేవలం టిడిపి హయాంలోనే జరిగిందన్నారు. గతంలో కేశఖండశాలలో ఐదు రూపాయలుగా ఉండే పీస్ రేట్ ని చంద్రబాబు హయాంలో రూ.25గా చేశారని, ఆ కాలంలోనే ఫెడరేషన్ ద్వారా ఎంతో మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. నాయీ బ్రాహ్మణులకు శాసన మండలిలో అవకాశం కల్పించాలని సుందర బాబు విజ్ఞప్తి చేశారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య దూరం

చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-నరసరావుపేట

పేద విద్యార్థులకు విదేశీ విద్యను వైసిపి దూరం చేసిందని నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు కలెక్టరేట్ లో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక గడియార స్తం భం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అరవిందబాబు మాట్లా డుతూ టిడిపి హయాంలో ఎస్సి,ఎస్టి,బిసి వర్గా ల్లోని 4,923 మంది విదేశాల్లో చదువుకునేం దుకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత పది లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచడం జరిగిం దన్నారు. ప్రతి పక్ష నేత హోదాలో నాడు జగన్ చేపట్టిన పాదయాత్ర, ఎన్నికల ప్రచారంలో రూ.20 లక్షలతో విదేశీ విద్య అందిస్తామన్న హామీని మేనిఫెస్టోలో పొందుపరిచి అధికారం లోకి వచ్చాక ఆ పథకాన్నే నిలిపివేశారని విమర్శించారు. విదేశీ విద్య పథకాన్ని ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీ వర్గాలతో సహా



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రతిపక్షాలు మీడియా ఒత్తిడి చేయడంతో జగనన్న విదేశీ విద్య దీవెన పేరుతో పునరుద్ధరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్య క్షులు సాతులూరి కుమార్, బాలు, రాయప్ప,గిద్దల వెంకటయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సాల్మన్‌రాజు

ప్రజ్ఞా వికాస టాలెంట్ టెస్ట్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఫిరంగిపురం : స్థానిక మండలంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ ఐ, యుటిఎఫ్ జెవివి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజ్ఞ వికాస టాలెంట్ టెస్ట్ కరపత్రాన్ని ఎంఈఓ జి. సాల్మన్‌రాజ్ బుధవారం ఆవిష్కరించారు.అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు బండ్ల ప్రసాద్ మాట్లాడుతూ ఫిరంగిపురం మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్ ప్రైవేట్ స్కూల్స్‌లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పవన్ కుమార్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు బండ్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ కార్తీక్, జిల్లా సహాయ అధ్యక్షులు జాను, డేవిడ్ రాజు, హృదయరాజు, నాయకులు పాల్గొన్నారు



సరుకులను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ పొన్నూరు వారి ఆధ్వర్యంలో పుట్ల సునంద అమ్మ జ్ఞాపకార్థం ఏడో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల సహకారంతో అమ్మ సేవ నిలయంలో నిత్యవసర సరుకులు అల్పాహారం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పుట్ల వరప్రసాద్ శ్యాం ప్రసాద్ సువర్ణ లత పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు టి.శెట్టి ఉమాశంకర్ జ్యోతి పవన్ పాల్గొన్నారు



విద్యార్థినిని అభినందిస్తున్న వర్శిటీ విసి రాజశేఖర్

ఉత్తమ విద్యార్థి బహుమతికి వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి -ఎఎన్‌యు

మైక్రో బయాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఉత్తమ విద్యార్థుల బహుమతి కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ విద్యార్థులు ఎంపికైనట్లు విభాగాధిపతి డాక్టర్ అమృతవల్లి తెలిపారు. మైక్రో బయాలజీ విభాగానికి చెందిన గుణకాల రూపరాణి, ఏల్చూరి ప్రశాంతిలు అవార్డుకు ఎంపికైనట్లుగా చెప్పారు. ఈ సందర్భంగా విసి పి. రాజశేఖర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పి.వరప్రసాద మూర్తి రిజిస్ట్రార్ బి.కరుణ, మైక్రో బయాలజీ అధ్యాపకులు డాక్టర్ అమతవల్లి, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

మాతా,శిశుమరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారి సేవలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిఎస్‌సి ప్రధాన వైద్యులు ఎం. కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-తాడేపల్లి

మాతా, శిశుమరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారి సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తాడేపల్లి పిఎస్‌సి ప్రధాన వైద్యుడు డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం తాడేపల్లి పిహెచ్‌సిలో కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిల్కారి సేవలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్యపరీక్షలు తదితర అంశాలపై కిల్కారి పేరిట వాయిస్‌కాల్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందని చెప్పారు. గర్భవతిగా ఉన్న సమయంలో స్థానిక ఎఎన్ఎం దగ్గర వివరాలను నమోదు చేసుకునేటప్పుడు ఇచ్చిన మొబైల్ నంబర్‌కు కిల్కారి వాయిస్‌కాల్స్ వస్తాయని, గర్భవతుల్లో కలిగే ఎన్నో సందేహాలు నివృతి చేసే విధంగా వాయిస్‌కాల్‌లో సందేశముంటుందని తెలిపారు. మహిళ గర్భం దాల్సిన నాలుగో నెల నుండి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్ సందేశాలు వచ్చే విధంగా డిజైన్ రూపొందించినట్లు తెలిపారు. ఆశా కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడం ద్వారా మెరుగైన మాతా,శిశు ఆరోగ్యసంరక్షణా సేవలు అందించేందుకు మొబైల్ అకాడమీ కోర్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ అవగాహనా సదస్సులో రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.రాజు, రాష్ట్ర ఆశా టీమ్ లీడర్ వి.రూపస్‌పాల్, డిఐఒ గుంటూరు డాక్టరు కెవి సుబ్బరాజు,డిటిసిఒ, డిఎల్ఓ బి.లక్ష్మానాయక్, డిపిహెచ్ఎన్ఓ శాంతకుమారి,ఎఎంఒ రాజునాయక్,ఎంఒ పిహెచ్‌సి తాడేపల్లి డాక్టరు కెవి కిరణ్‌కుమార్, డాక్టరు అనూష, ఎంఒయుపిహెచ్‌సి ఆర్ఎంఎస్‌కాలనీ తాడేపల్లి మానస మంజరి, ఎంఒయుపిహెచ్‌పి కుంచనపల్లి ఎస్. నాగేంద్రబాబు, ఆరోగ్యమిత్ర కె.సూర్యనారాయణ, పిహెచ్‌సి వైద్యులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కుర్నేళ్లను అభినందిస్తున్న నాయకులు

బీసీ సేన పట్టణ అధ్యక్షునిగా కుర్నేళ్ళ

ప్రజాశక్తి - మంగళగిరి:మంగళగిరి బీసీ సేన కార్యాలయంలో బుధవారం బీసీ సేన సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు కన్వీనర్ సాధు వేణుగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పట్టణ బీసీ సేన అధ్యక్షునిగా కుర్నేళ్ళ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తొడిమెళ్ళ వేణు, ఉపాధ్యక్షులు కుంచాల శ్రీనివాసరావు, యువజన విభాగం ఉపాధ్యక్షులు నక్కా శివ దుర్గారావు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ తుళ్లూరు సాయితేజ; జిల్లా ఉపాధ్యక్షులు కుర్నెళ్ళ వెంకటశేఖర్, చినకాకాని కన్వీనర్ జి.శివ సత్యనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు సత్తెపల్లి రాజశేఖర్‌లు నియమితులయ్యారు. వారికి జిల్లా అధ్యక్షులు నాగకుమార్ నియామకపత్రాలు అందజేశారు.

ఉండవల్లిలో ఎమ్మెల్యేకు నిరసన సెగ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి అంబేద్కర్ నగర్‌లో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి బుధవారం నిరసన సెగ తగిలింది. స్థానికంగా మంచినీటి పైపులైన్ పరిశీలనకు ఆయన అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకులు రాయపూడి కిరణ్ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు, 'రాజధాని ద్రోహి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఉండవల్లి క్వారీ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. సమాధానం చెప్పేందుకు ఎమ్మెల్యే కారు దిగినా,సెక్యూరిటి సిబ్బంది వెంటనే ఆయనను అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. అనుకోని ఈ పరిణామంతో ఎమ్మెల్యే ఒకింత అసహనానికి గురయ్యారు. సమస్యలనుఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోకుండా వెళ్లడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

కుట్టుమిషన్ శిక్షణాతరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లిలో ఉత్సాహంగా కుట్టుమిషన్ శిక్షణాతరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. టిడిపి ఆధ్వర్యంలో స్త్రీ శక్తి పేరుతో మహిళలకు కుట్టుమిషన్లు, స్వయం ఉపాధి శిక్షణాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు ఉత్సాహం పాల్గొని శిక్షణ తీసుకున్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, రెండో బ్యాచ్ ఒంటి గంట నుంచి 3 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణ పూర్తయినవారికి



ఉచిత శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

కుట్టుమిషన్లతోపాటు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు చెప్పారు.



ఇంటర్వ్యూలలో పాల్గొన్న విద్యార్థులు

క్యాంపస్ ఇంటర్వ్యూలో 154 మంది ఎంపిక

ప్రజాశక్తి -ఎఎన్‌యు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 154 మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇసుజి మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సిటీ ల ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలో నిర్వహించారు. కళాశాలకు చెందిన 218 మంది విద్యార్థులు హాజరు కాక ఆన్లైన్ పరీక్షలు 154 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో వర్సిటీకి చెందిన 62 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ పి. సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా విసి పి రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఈ శ్రీనివాసరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ తేసిఫ్ అహ్మద్, హెచ్ ఆర్ మేనేజర్ ఎస్. నరేష్, కంపెనీ ప్రతినిధులు, వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో తృణధాన్యాల వంటల ప్రదర్శన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తెలుగు వారి వంటకాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం తెలుగు ప్రజలందరూ గర్వపడాల్సిన విషయమని బిజెపి జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ అన్నారు. బుదవారం కెఎల్ విశ్వవిద్యాలయంలో మిల్లెట్ బఫ్ఫెట్ పేరుతో ఏర్పాటు చేసిన తృణదాన్యాల వంటకాల ప్రదర్శన పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తృణదాన్యాల ప్రాచుర్యానికి ఎంతగానో కృషి చేస్తుందని, మోది చేసిన కృషి కారణంగానే ఐక్యరాజ్య సమితి 2023 సంవత్సారాన్ని తృణదాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. కెఎల్‌యు ఫుడ్ టెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మన పురాతన వంటకాలైన రాగి సంకటి, కొర్ర అన్నం, జొన్న రొట్టె వంటి చిరుదాన్యాల వంటకాలకు రోగనిరోధక శక్తిని పెంచి రాబోయే వ్యాధులను సైతం అరికట్టగల సామర్థ్యం ఉందని అన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ తృణదాన్యాల ఆవశ్యకతను ప్రజలకు ప్రజలందరికి చాటి చెప్పేందుకు కెఎల్‌యు కృషి చేస్తుందని తెలిపారు. తృణదాన్యాల వంటకాలలో రాగులతో బిస్కెట్ తయారు చేసిన ప్రథమ బహుమతి ఫుడ్ టెక్నాలజీ విద్యార్థిని వి.దేవిశ్రీ, ద్వితీయ బహుమతిని కొర్రలతో కేక్‌ను తయారు చేసిన హెూటల్



వివిధ రకాల తృణధాన్యాల వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మేనేజ్ మెంటు విద్యార్థిని సిహెచ్.అక్షయ,తృతీయ బహుమతి హెూటల్ మేనేజ్ మెంటు విద్యార్థి డి.తరుణ్ లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో వైస్ చాన్సులర్ డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్టొన్నారు.



సాంబశివరావును సత్కరిస్తున్న థియేటర్ కమిటీ బృందం

పౌరాణిక కళాకారుడు సాంబశివరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి:స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో బుధవారం ఎన్టీఆర్ నటించిన కార్తవరాయుని కథ చిత్రాన్ని ఉంచితంగా ప్రదర్శించారు. కళాకారుల సత్కారాల పండుగలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక కళాకారుడు వి.సాంబశివరావును సత్కరించారు. కార్యక్రమంలో మాలేపాటి వెంకటరమణ, గుగ్గిలం సుబ్బారావు, కె.సురేష్‌బాబు, యలవర్తి కృష్ణ, నాగం రమేష్, పెమ్మసాని పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడమే లక్ష్యం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడమే కాంగ్రెస్ ఏకైక లక్ష్యం అని మంగళగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ సలీం అన్నారు. బుధవారం ఎంటి ఎంసీ పరిధిలోని కుంచనపల్లి, ప్రాతూరు, చిరావూరు, గ్రామాలలో షేక్ సలీం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకులు రాహుల్ గాంధీ పిలుపుమేరకు హాథ్‌సేహాత్ జోడోయాత్రను చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు పటాన్ సుభాని, సీనియర్ నాయకులు గోలి సాంబశివరావు, అమర సుధాకర్, షేక్ చాంద్ భాష, ప్రాతూరు గ్రామ అధ్యక్షులు సల్మాన్, చిర్రావూరు మోహన్, హరిబాబు, పి రసూల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

నెహ్రూ నికేతన్‌లో రిఫ్లెక్షన్స్ వేడుకలు

ప్రజాశక్తి-తెనాలి:స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన రిఫ్లెక్షన్స్ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ఎం.లక్ష్మినారాయణ బుధవారం ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్, సోషల్ బోధన ఉపకరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ రానున్నది డిజిటల్ యుగమేనన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్న యాజమాన్యాన్ని అభినందించారు. మురళీకాంత్ మాట్లాడుతూ డిజిటల్ విధానాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పాఠ్యాంశాల భోధనలో సులభతరమైన విధానాలను పాటిస్తున్నామన్నారు. విద్యార్థులో సామర్థ్యాలను వెలికి తీసేందుకు నాలుగు రోజులపాటు రిఫ్లెక్షన్స్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఎంఈవోను సత్కరించారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు













ఉత్సాహంగా మహిళా ఫెస్ట్



- ప్రత్యేక ఆకర్షణగా 'మనసులో మాటలు'
- తమ ఆలోచనలను వ్యక్తీకరించిన విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: మహిళల్లో సృజనాత్మకతను పెంపొందించి తెలుగు సంస్కృతిని నేటి తరం విద్యార్థినులకు తెలియజేయాలనే ఉద్దేశంతో తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఫెస్ట్‌కు విశేష స్పందన లభిస్తుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ఫెస్ట్‌లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలిరోజు బుధవారం చిత్రలేఖనం, వ్యాసరచన, కళారచన, కవితా రచన, ఏకపాత్రాభినయం, జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలు, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం వంటి అంశాలలో పోటీలను నిర్వహించారు. వీటిల్లో సుమారుగా 700 మందికిపైగా పాల్గొన్నారు. వ్యాసరచన అంశంకు సంబంధించి అమెరికా అమ్మాయి, కథా రచనలో మహిళలు సమాన అవకాశాలు అనే అంశంపై నిర్వహించగా మహిళలు తమ అభిప్రాయాలను చక్కగా తెలియజేశారు. ఏకపాత్రాభినయంకు సంబంధించి ధనవంతుల ఇళ్లల్లో 'పనిమనిషి' పడే ఇబ్బందులను చూపించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. అలాగే జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఏడాది ప్రత్యేకంగా నిర్వహించిన 'మనసులో మాట' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్ గున్ని మాట్లాడుతూ మహిళలకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫోన్ చేయాల్సిన అవసరం లేదని డయల్ 100, దిశా మొబైల్ యాప్ ద్వారా, విజయవాడ ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రామ్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, బాలికలు, మానసిక ధైర్యానికి అవలంభించాల్సిన పద్ధతులను వివరించారు. సభకు అధ్యక్షత వహించిన ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ఎం.కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళలు, బాలికలు, ఎదుర్కొనే సమస్యలు ఇబ్బందులు చాలా భాగం బయటకు చెప్పుకోలేనివన్నారు. వారికి ధైర్య సాహసాలను ఇవ్వడం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం వివిధ కళాశాలల విద్యార్థినులు తమ మనసులోని మాటలను భావాలను స్పష్టం చేశారు. వాటికి పరిష్కారాలు, ఎదుర్కొన్న విధానాన్ని కూడా వివరించారు. కృష్ణకుమారి సంధించిన ప్రశ్నలకు విద్యార్థినులు అప్పటికప్పుడు ఇచ్చిన సమాధానాలు అందరినీ అబ్బురపరిచాయి.

నేటి కార్యక్రమాలు...

బెస్ట్‌ఫ్రమ్ వేస్ట్, వెజిటబుల్ ఫ్రూట్ కార్వింగ్, వక్తృత్వం, లఘునాటిక, కోలాటం, పాశ్చాత్య నృత్యం, స్పాట్ స్కిట్ అంశాలపై పోటీలు, ప్రదర్శన జరుగనున్నాయి. సాయంత్రం ఐదు గంటలకు ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందించనున్నారు.

మహిళా సమస్యల గురించి తెలుస్తుంది

షఫీరున్నీసా, సింగ్‌నగర్

సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు గురించి తెలుసుకుంటున్నాం. మహిళా ఫెస్ట్‌లో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న వారు సమాజంలో జరుగుతున్న అంశాలను గురించి చక్కగా తెలియజేస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాలు మాకు విజ్ఞానం.. వికాసంతో పాటు ప్రశ్నించేతత్వం కూడా పెంచుతున్నాయి. ముఖ్యంగా మహిళల్లో క్రియేటివిటీ కూడా పెరగడానికి దోహదపడుతుంది.



కార్యక్రమాలు బాగున్నాయి

కె.నాగమణి, ఇంజనీరింగ్ విద్యార్థిని

మహిళా ఫెస్ట్‌లో గత రెండు సార్లుగా పాల్గొంటున్నాను. ఎప్పటికప్పుడు కొత్త అంశాలతో చాలా చక్కటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొనే వారు కూడా సమాజంలో మహిళపై జరుగుతున్న పలు అంశాలను తెలియజేసే విధంగా వాస్తవిక రూపంలో చక్కగా వివరిస్తున్నారు. నేను వ్యాస రచన పోటీల్లో పాల్గొంటున్నాను. ఇక్కడ జరుగుతున్న ప్రతి కార్యక్రమాలను చూస్తున్నాను.



సృజనాత్మకత పెరుగుతుంది

ఎం.వాసవి, విజయ ఇంజనీరింగ్ కళాశాల

మహిళా ఫెస్ట్ కార్యక్రమాలు మహిళల్లో సృజనాత్మకత పెంచేవిగా ఉంటున్నాయి. నేను వివిధ కళాశాలల్లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతున్నాను. వాటితో పాటు సమానంగా చక్కటి కార్యక్రమాలు తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో మహిళా ఫెస్ట్‌లో నిర్వహిస్తున్నారు. నేను రెండు సార్లుగా వస్తున్నాను. వ్యాసరచన, డిబేట్ అంశాల్లో పాల్గొంటున్నాను. సమాజంలోని పలు అంశాలపై పోటీలను నిర్వహించడం బాగుంది.



ఫెస్ట్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది : కె. భానుశ్రీ వల్లి

మహిళా ఫెస్ట్‌కు మొదటిసారి వచ్చాను. ఫెస్ట్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో నచ్చాయి. ఆనందంతో పాటు ఉల్లాసం కలుగుతున్నాయి. ఇక నుండి నేను ప్రతి ఏటా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఇటువంటి కార్యక్రమాలు మహిళలకు ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయి. అంతేకాకుండా భవిష్యత్తుకు ప్రణాళికలను నిర్ధేశించుకునేందుకు చక్కని నాలెడ్జి వస్తుంది.



సంస్కృతీ, సంప్రదాయాలు తెలుస్తున్నాయి

కె.నవ్య, ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల

ప్రస్తుత మోడరన్ కల్చర్, ఆధునిక పోకడతలో సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. అయితే మన సంప్రదాయలు గురించి నేటి తరం మరచిపోతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయలు తెలియజేసే విధంగా మహిళా ఫెస్ట్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంతో చక్కగా ఉన్నాయి. మరిచిపోతున్న మన సంస్కృతిని నేను తెలుసుకుంటున్నారు. పది మందికి కూడా తెలియజేసే విధంగా ఉన్నాయి.



ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

వి.శోభన సాయి, విద్యార్థిని

మహిళలు ముఖ్యంగా విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ఇక్కడే జరిగే కార్యక్రమాలు, వివిధ సదస్సులు, సమావేశాలు ఉన్నాయి. ఇక్కడ జరుగుతున్న అంశాలను పరిశీలిస్తే మనం వెనకబడి ఉన్నామని, భవిష్యత్తు తరాల్లో మహిళలు ముందుండాలంటే ఏ విధంగా ఉండాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా చక్కగా చూపిస్తున్నారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.





రాధికారెడ్డి





డిసిపి విశాల్ గున్ని



